

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,42,464లు, బంగారం 2 గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 44 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కుప్పకూలిన సొరంగం

ఖుర్దా–బొలంగీర్ సొరంగం కుప్పకూలింది. అధికారులు పరిశీలిస్తున్నారు.

-8లో



ఇంటిలో దొంగతనం

జయపూర్‌లోని ఓ ఇంటిలో దొంగతనం జరిగింది. బంగారం, నగదు దోచుకెళ్లారు.

-8లో

న్యూస్‌రీల్

సోషల్ మీడియా కలకలం



సోషల్ మీడియాలో వైరల్ అయిన ఏకే-47 రైఫిల్‌తో నిందితుని ఫొటో

భువనేశ్వర్: పాకిస్తాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసిన ఆరోపణ కింద ఇటీవల ఇద్దరు యువకులను అరెస్టు చేసిన విషయం విదితమే. వీరిలో ఒకరు ఏకే 47 రైఫిల్ కలిగి ఉన్నట్లు ఆరోపణలు భగ్గుమన్నాయి. ఈ తుపాకీతో ఫేస్‌బుక్‌లో రైఫిల్‌తో ఉన్న నిందితుడి ఫొటో వైరల్ అవుతోంది. ఈ ప్రసారంతో వివాదం చెలరేగింది. పాకిస్తాన్‌తో సంబంధాలపై దర్యాప్తు జరపాలని 'హిందూ సేన' డిమాండ్ చేసింది.

రైల్వే అధికారులకు సత్కారం



సత్కారం పొందిన రైల్వే ఉద్యోగులు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే (ఈకోర్) జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ నలుగురు రైల్వే ఉద్యోగులను వారి అత్యుత్తమ పనితీరు, అప్రమత్తతకు గుర్తించి సత్కరించారు. వారిలో ట్రాక్ మెయింటెయినర్ పూజన్ కుమార్ (టిట్లాగడ్), ట్రాక్ మెయింటెయినర్ దినేష్ కుమార్ (మటగజ్‌పూర్), లోకో పైలట్ జగదీష్ సమల్ (కెందుఝొరొగొడా), రైలు మేనేజర్ బొడ్డాని శ్రీనివాసరావు (విశాఖపట్నం) ఉన్నారు. వీరంతా దైనందిన విధుల నిర్వహణలో అసాధారణమైన అప్రమత్తతను ప్రదర్శించారు. ఈ అవార్డులను ప్రదానం చేస్తూ విధి నిర్వహణలో వారి నిబద్ధత, కృషిని తూర్పు కోస్తా రైల్వే (ఈకోర్) జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ ప్రశంసించారు. ఆ నలుగురి అంకితభావం, అప్రమత్తతకు గుర్తింపుగా ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు సేవల భద్రత, విశ్వసనీయతను నిర్వహించడంలో ట్రాక్ మెయింటెయినర్లు, లోకో పైలెట్లు, టెక్నీషియన్లు, స్టేషన్ ఆపరేటర్లు వంటి ముందంజ సిబ్బంది కీలక పాత్రధారులుగా జనరల్ మేనేజర్ పేర్కొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: జయపురం సమితి గొడాపాదర్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా నాటుసారా తయారీ చేస్తున్న బట్టీలపై అబ్కారీ సిబ్బంది సోమవారం దాడులు జరిపారు. ఈ సందర్భంగా నాలుగు బటీలను ధ్వంసం చేసినట్టు జయపురం అబబ్కారీ విభాగ అధికారి సుబ్రత్ కేశరీ హిరన్ వెల్లడించారు. దాడుల్లో 50 లీటర్ల సారాతో పాటు సారా తయారు చేసేందుకు సిద్ధం చేసిన 600 లీటర్ల ఇప్ప ఊటను పట్టుకున్నామన్నారు. ధ్వంసంస చేసిన సారా, ఊట విలువ రూ. 50 వేలు ఉంటుందని వెల్లడించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో గొడాపాదర్ అడవిలో సారా తయారు చేస్తున్న సమాచారం విశ్వసనీయవర్గాల ద్వారా తెలియడంతో దాడలు చేశామన్నారు. తమను చూసిన సారా మాఫియా పరారైనట్టు వెల్లడించారు. సారా వంట సామగ్రిని సీజ్ చేసినట్లు చెప్పారు.

ఏనుగు కళేబరం లభ్యం



కుళ్లిన ఏనుగు కళేబరం

భువనేశ్వర్: కెంజొహర్ జిల్లా తెల్కోయ్ రేంజ్ తమాంగ్ అభయారణ్యంలో కుళ్లిన ఆడ ఏనుగు కళేబరాన్ని గుర్తించారు. దీని వయసు 20 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. పరీక్ష కోసం ఏనుగు కళేబరాన్ని ఆస్పత్రికి అధికారులు తరలించారు. ఈ నివేదిక ఆధారంగా మరణానికి కారణం తెలుస్తుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఆగ్నేయ ఆసియాతో..

మనది బలమైన బంధం



తృతీయ అంతర్జాతీయ భారతీయ సాంస్కృతిక వారసత్వ సదస్సు (ఐసీఐసీహెచ్) ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు.

- రాష్ట్ర గవర్నర్ డాక్టరు కంభంపాటి హరి బాబు

భువనేశ్వర్: గతం కేవలం చరిత్రగా మిగిలిపోయేది కాదని, వర్ధమాన ప్రపంచంతో వ్యవహరించడానికి ఉపయోగకరమైన ఆలోచనలను అందజేస్తుందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రసంగంలో తెలిపారు. రెండు రోజుల తృతీయ అంతర్జాతీయ భారతీయ సాంస్కృతిక వారసత్వ సదస్సు (ఐసీఐసీహెచ్) ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇరుగు పొరుగు ప్రాంతాలతో అవినావభావ సంబంధాల రంగంలో ఉమ్మడి పరిశోధనలు అవసరమని తెలిపారు. కళింగ, ఆగ్నేయాసియా నాగరికత అనుసంధానం అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రాచీన కళింగ సముద్ర (నావిక) వారసత్వం పర్యావరణ, అభివృద్ధి సవాళ్లను పరిష్కరించడంలో ఆగ్నేయ ఆసియాకు బలమైన అనుభవాల్ని అందజేస్తుందన్నారు. ఇండోనేషియా, మలేషియా, మయన్మార్, థాయిలాండ్, కంబోడియా, వియత్నాం వంటి దేశాలతో నావికా వ్యాపారం, అన్వేషణ, సాంస్కృతిక ప్రతిస్పందన కేవలం ఒడిశా గొప్ప చరిత్ర, గర్వించదగ్గ విషయం మాత్రమే కాదు సమకాలీన ప్రాంతీయ సహకారానికి మార్గదర్శకం అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సదస్సు ఒడిశా అద్భుతమైన గతంతో తిరిగి అనుసంధానించడంలో ఒక అర్థవంతమైన అడుగు అని అభివర్ణించారు. నాటి కళింగ నేటి ఒడిశా రెండు వేల సంవత్సరాలకు పైగా ఆగ్నేయాసియాతో బలమైన సముద్ర, సాంస్కృతిక సంబంధాలను కలిగి ఉందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ ప్రాంతం నుంచి ప్రజలు విస్తృత ప్రయాణాలు శిల్పాలు, శాసనాలు, ఆచారాలు మరియు స్థల పేర్లలో ప్రతిబింబిస్తున్నాయి. భారతీయ సంస్కృతి, మత వ్యాప్తిలో కళింగ సముద్ర నెట్‌వర్క్ ప్రధాన పాత్ర పోషించిందని ఆయన నొక్కి చెప్పారు. 'కంబోడియాలోని అంగ్‌కర్ వాట్, ఇండోనేషియాలోని బోరోబుదూర్ వంటి దేవాలయాలు కళింగ ఆలయ నిర్మాణ ప్రభావాన్ని చూపుతాయి. రామాయణం, మహాభారతం మరియు సంస్కృతం వ్యాప్తి, ఇండోనేషియాలో నైపి, కంబోడియాలో ప్చుమ్ బెన్ వంటి పండుగల వేడుకలు లోతైన సాంస్కృతిక బంధాలను ప్రతిబింబిస్తాయి' అని ఆయన అన్నారు. ఆధునిక దేశాలు ఈ వారసత్వం నుంచి ఆచారవ్యవహారాలు పరస్పర గౌరవం, స్థానిక సంప్రదాయాలను సుసంపన్నం చేయడం నేర్చుకోవచ్చని డాక్టర్ కంభంపాటి సూచించారు. ఓడరేవు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, గ్రీన్ షిప్పింగ్‌ను స్వీకరించడం, డిజిటల్ సాంస్కృతిక అనుబంధం ప్రోత్సహించడం ప్రాంతీయ సంబంధాలను బలోపేతం చేయగలవని తెలిపారు. భవిష్యత్ తరాలు గర్వించే రీతిలో ఉమ్మడి పరిశోధన మరియు వారసత్వ విద్య ప్రాధాన్యతని సవివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఇతరులలో కటక్ లోక్ సభ సభ్యుడు భర్తృహరి మహతాబ్, భారత మాజీ విదేశాంగ కార్యదర్శి లలిత్ మానసింగ్, ఒడియా భాష, సాహిత్యం మరియు సంస్కృతి విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సంజీబ్ కుమార్ మిశ్రా మరియు వన్ ఆసియా ఫౌండేషన్ ఛైర్మన్ పతిత పావన మిశ్రా, తృతీయ ఐసీఐసీహెచ్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఉపేంద్ర పాఢి ఉన్నారు.



రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ప్రసంగం

శ్రీ మందిరం పదజాలం చట్టబద్ధం: సీఏఓ



డాక్టరు అరవింద కుమార్ పాఢి

భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాత శ్రీ జగన్నాథుని సంస్కృతి ప్రచార, ప్రసార సన్నాహాల్లో పొరపాట్లు జరగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇటీవల పశ్చిమ బెంగాలు దిఘా ప్రాంతంలో కొత్తగా నిర్మితమైన శ్రీ జగన్నాథ ఆలయం నామకరణం పురస్కరించుకుని తలెత్తిన వివాదం నేపథ్యంలో శ్రీ మందిరం పాలక మండలి ఈ దిశలో తొలి అడుగు వేసింది. పాలక మండలి అధ్యక్షుడు పూరీ గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తాజా ప్రతిపాదన ప్రవేశ పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొన్నారు. శ్రీ మందిర్ నిఘంటువుకు చట్టబద్ధత కల్పించాలని ప్రతిపాదించారు. శ్రీ జగన్నాథుని సంస్కృతికి సంబంధించిన పదజాలం అన్యథా ప్రయోగించకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ మేరకు స్వామి కార్యకలాపాలకు సంబంధించిన పదాలకు పేటెంటు హక్కులు సాధించాలని ప్రతిపాదన ప్రవేశ పెట్టారు. శ్రీమందిర్, శ్రీ జగన్నాథ ధామ్, మహాప్రసాద్, శ్రీ జగన్నాథ దేవాలయం లోగో, శ్రీక్షేత్రం, పురుషోత్తం ధామ్ వంటి నిత్య, దైనందిన, ప్రత్యేక పద ప్రయోగాల క్రమబద్ధీకరణ కోసం పేటెంటు సాధించాలనే ప్రతిపాదనకు పాలక మండలి ఆమోదించిందని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు.

పొహండి క్రమబద్ధీకరణ

గత ఏడాది అడప మండపం పొహండి సమయంలో చోటు చేసుకున్న అసహజ సంఘటనపై త్రిసభ్య విచారణ కమిటీ నివేదిక దాఖలు చేసింది. ఈ నివేదికని పాలక మండలి సమావేశంలో ప్రవేశ పెట్టారు. ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా కమిటీ చేసిన సిఫారసులు కార్యాచరణ కోసం విస్తృతంగా చర్చించడం జరిగిందని సీఏఓ వివరించారు. గత ఏడాది అడప మండపం పొహండి సందర్భంగా బలభద్ర స్వామి మూల విరాటు ఊహాతీతంగా నేలకొరిగి బోర్లా పడింది. ఈ సంఘటన అత్యంత అపచారంగా భావించిన భక్తజనం భావోద్వేగానికి గురైంది. దీనిపై విచారణకు త్రిసభ్య కమిటీని నియమించారు. ఈ కమిటీ సమర్పించిన నివేదికని పాలక మండలిలో ప్రవేశ పెట్టారు. అనుభవజ్ఞులు, సీనియర్ దైతపతులు, అనుబంధ సేవకుల సమన్వయంతో పొహండి క్రమబద్ధీకరించడంపై సమావేశంలో చర్చించారు. ఈ మేరకు నిర్ధారిత కార్యాచరణ (ఎస్‌ఓపీ) రూపొందించనున్నారు. ఈ ఏడాది చారుమళ్ల తయారీలో సాధారణం కంటె మరికొంత పొడవైన తాటి మట్టలు వినియోగానికి యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అవసరమైన తాటి దూలాలు శ్రీ మందిరం ప్రాంగణానికి చేరాయి. చారుమళ్ల తయారీలో నైపుణ్యత పొందిన వర్గాల సంప్రదింపులు, దైతపతి, మహరణ, భొయి సేవకుల సహాయ సహకారాలు తీసుకుంటారు. ప్రథమ సోపానం నుంచి నీలాద్రి విజే వరకు పొహండి క్రమశిక్షణపై సుదీర్ఘంగా చర్చించారు. సేవాయేతర వర్గాలు రథాలపైకి ఎక్కడం లేదా అనధికారిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతారు. గత ఏడాది ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడిన వారి వ్యతిరేకంగా సాధారణ చర్యలతో చేతులు దులిపేసుకున్నారు. ఈ ఏడాది ఈ చర్యలు మరింత కఠినతరం కానున్నాయని హెచ్చరించారు. రథాలపై మొబైలు ఫోనులు వినియోగిస్తే తారసడితే సంబంధిత వ్యక్తుల వ్యతిరేకంగా క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడంతో మొబైలు ఫోను యథాతథంగా జప్తు చేయడం జరుగుతుందన్నారు.

ఒక్కో రథానికి పొహండి దళం

రథాలపైకి మూల విరాటుల తరలింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా ఒక్కో రథానికి ప్రత్యేకంగా పొహండి దళం ఏర్పాటు చేస్తున్నారు. ఈ దళంలో సభ్యుల పరిమితి, ఎంపిక, నియామకం బాధ్యతలు శ్రీ మందిరం పాలక వర్గానికి కేటాయించారు. శ్రీ మందిరం ఉపాధ్యక్షుడు, పూరీ జిల్లా కలెక్టరు, బాడొగ్రాహి, సేవాయత్ వర్గాల ప్రతినిధుల సంప్రదింపుల మేరకు పొహండి కార్యక్రమం విజయవంతం చేసేందుకు కార్యాచరణ ఖరారు చేస్తారు.

మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌లో కౌన్సిలర్‌కు హెచ్చరిక



సిమ్మాంచల్ బిసాయితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న చైర్మన్ నౌరి, వైస్ చైర్ పర్సన్ సునీత



సిమ్మాంచల్ బిసోయి

కొరాపుట్: జయపూర్ మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో సిట్టింగ్ కౌన్సిలర్‌కి ప్రభుత్వ ఉద్యోగి హెచ్చరికలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 22వ తేదీన కౌన్సిల్ మీటింగ్ జరిగిన విషయం పాఠకులకు విదితమే. ఈ సమావేశంలో 17వ నంబర్ వార్డు కౌన్సిలర్ సిమ్మాంచల్ బిసోయి తన వార్డులో పింఛన్‌దారుల్లో మృతుల వివరాలు, ప్రస్తుత పింఛన్ పొందుతున్న వారి వివరాలు అడిగారు. ఆ విభాగం పర్యవేక్షిస్తున్న ఉద్యోగి స్పందిస్తూ నీ సంగతి చూస్తాను అని హెచ్చరించాడు. దీంతో కౌన్సిలర్ మౌనంగా ఉండిపోయారు. ఇదే సమయంలో కౌన్సిల్ హాల్‌లో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి, సబ్ కలెక్టర్ అక్కవరం సక్యారెడ్డి, చైర్మన్ నౌరి మహంతి, వైస్ చైర్మన్ బి.సునీతాలు వేదిక మీద ఉన్నారు. అదే సమయంలో వేరే చర్చలు జరుగుతుండడంతో వారు ఈ ఘటన గమనించలేదు. ఈ విషయం తర్వాత బయటకు వచ్చింది. దీంతో వైస్ చైర్మన్ బి.సునీత తన చాంబర్‌కి బాధిత కౌన్సిలర్‌ను పిలిపించుకొని వివరాలు తెలుసుకున్నారు. వెంటనే చైర్మన్ నౌరి మహంతి ఇతర కౌన్సిలర్లు కూడా సునీతా చాంబర్‌లో అత్యవసర సమావేశమయ్యారు. అనంతరం సునీత మీడియాతో మాట్లాడుతూ జయపూర్ కౌన్సిల్ చరిత్రలో ఇలాంటి అవమానకర సంఘటన చరిత్రలో ఏనాడూ జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా తామందరం సాటి కౌన్సిలర్‌కి బాసటగా నిలుస్తామన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు.

వ్రత కాలం..



పూరీ సాగర తీరంలో సుదర్శన్ పట్నాయక్ తీర్చిదిద్దిన సావిత్రి వ్రతం సైకత శిల్పం

భువనేశ్వర్: రాష్ట్రం అంతటా వివాహిత మహిళలు సోమవారం సావిత్రి వ్రతం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఏటా జ్యేష్ఠ మాసం అమావాస్య నాడు ఈ వ్రతం జరుపుకోవడం ఆచారం. రాష్ట్రంలో ఆచారం ప్రభావంతో ఈ తిథి సావిత్రి అమావాస్యగా ప్రతీతి. భర్తల దీర్ఘాయుష్షు, శ్రేయస్సు కోసం పుణ్య స్త్రీలు ఈ వ్రతం క్రమం తప్పకుండా ఆచరిస్తారు. సావిత్రి, సత్యవంతుల పౌరాణిక గాథ ప్రకారం రాష్ట్రంలో మహిళలు భర్తల దీర్ఘాయుష్షు కోసం ఈ వ్రతం ఆచరించడం విశేషం. భర్త పట్ల అంకితభావంతో భార్య తన అచంచలమైన ప్రేమ, త్యాగం, ఆధ్యాత్మిక భావాన్ని ప్రతిబింబిస్తుంది.

సైకిళ్ల దొంగ అరెస్టు



చోరీ చేసిన సైకిళ్లతో నిందితుడు ఆనంద

జయపురం: జయపురం పట్టణంలో సైకిళ్లను చోరీ చేస్తున్న దొంగ పోలీసులకు చిక్కాడు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరగలించగా జడ్జి రిమాండ్ విధించినట్టు పట్టణ పోలీసు కేసు దర్యాప్తు అధికారి ఉమేష్ చంద్ర మహాపాత్రో సోమవారం వెల్లడించారు. అరెస్టు అయిన వ్యక్తి స్థానిక నొడియ బిడవాసి ఎస్.ఆనందగా వెల్లడించారు. ఈ నెల 21వ తేదీన స్థానిక దొబాసాహి నివాసి జి.శ్వేతచందన్ మేనల్లుడు సైకిల్‌పై ట్యూషన్ వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి ఇంటి ముందు సైకిల్ పార్కింగ్ చేశారు. కొంత సమయం తరువాత బయటకు వచ్చి చూడగా సైకిల్ కనిపించలేదు. ఎవరో సైకిల్ దొంగిలిచారని భావించి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో లభించిన ఆధారాలతో ఆనందను అదుపులోనికి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా అతడు దొంగతనాన్ని ఒప్పుకున్నాడు. అంతే కాకుండా దొంగిలించిన నాలుగు సైకిళ్లు తన ఇంటి వద్ద ఉన్నట్లు చెప్పడంతో పోలీసు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ప్రసాదరావుపేట, సోంబారుతోట, ధొబాసాహి, బిజూనగర్ ప్రాంతాలలో సైకిళ్లను చోరీ చేసినట్టు నిందితుడు అంగీకరించినట్టు పోలీసులు చెప్పార.

రథయాత్ర కార్యక్రమాలు ఖరారు



పూరీ గజపతి మహా రాజా అధ్యక్షతన శ్రీ మందిరం పాలక మండలి సమావేశం

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని వార్షిక రథయాత్ర ప్రణాళిక ఖరారైంది. పూరీ గజపతి మహా రాజా దివ్య సింఘ దేవ్ అధ్యక్షతన సోమవారం జరిగిన శ్రీమందిర్ పాలక మండలి సమావేశంలో ఈ ఏడాది జరగనున్న రథయాత్ర ప్రతిపాదిత కార్యక్రమాలు ఆమోదం పొందాయి. రథ యాత్రలో భాగంగా పరిగణించే స్నానోత్సవం మొదలుకొని నీలాద్రి విజే వరకు కొనసాగే పలు యాత్రలు, ఉత్సవాలు, ప్రత్యేక పూజాదుల కార్యక్రమాల్ని ఈ సమావేశంలో ఖరారు చేశారు. రథ యాత్ర సందర్భంగా నిర్వహించాల్సిన ఛొత్తీషా నియోగుల సమావేశంలో ఖరారు చేసిన వివిధ ఆచార వ్యవహారాలతో కూడిన కార్యక్రమాలను పాలక మండలి ఆమోదించిందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది జూన్ 27న రథ యాత్ర ఆ రోజు ఉదయం 6 గంటలకు మంగళ హారతితో యాత్ర కార్యక్రమం ప్రారంభం అవుతుంది. ఉదయం 9 గంటలకు రథ ప్రతిష్ఠ ముగియాలని నిర్ణయించారు. మూల విరాట్లను వరుస క్రమంలో రథాల పైకి సంప్రదాయ రీతులతో తరలించే పొహండి కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు పూర్తవుతుంది. రథాలపై మూల విరాటులు ఆసీనులైన తర్వాత గజపతి మహా రాజా 3 రథాలను ఊడ్చే సాంప్రదాయ 'ఛెరా పొంహరా కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2.30 నుండి 3 గంటల మధ్య ముగించాలని నిర్ణయించారు. అనంతరం రథాలకు సారథుల్ని అమర్చి చారుమళ్ల తొలగించి సాయంత్రం 4 గంటల నుండి రథాలను లాగేందుకు కార్యక్రమం ఖరారు చేశారు. జూన్ 11న జరగనున్న దేవ స్నాన పూర్ణిమ ఆచారాల ప్రణాళికలను ఈ సమావేశంలో పాలక మండలి ఆమోదించింది. మూల విరాటుల ప్రసిద్ధ గజానన అలంకరణ (హత్తి బేషా) సాయంత్రం 4.30 గంటలకు జరుగుతుంది. గుండిచా మందిరం నుంచి తిరుగు ప్రయాణాన్ని సూచిస్తూ, బహుడా యాత్ర సందర్భంగా, సాయంత్రం 4 గంటలకు రథం లాగడం ప్రారంభం కానుంది. ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి సీఏఓ, పూరీ కలెక్టర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సావిత్రి వ్రతం



బ్రాహ్మణ కుటుంబం ఇంట్లో జరుగుతున్న సావిత్రి వ్రతంలో మహిళలు



పూజ కోసం సిద్ధం చేసిన ఫలహారాలు



మర్రిచెట్టు వద్ద పూజకు వచ్చిన మహిళలు



కూమిటిగూడలో పూజలు చేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో సోమవారం భక్తిశ్రద్ధలతో సావిత్రి వ్రతాన్ని మహిళలు ఆచరించారు. భర్త ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ వ్రతాన్ని చేయడం ఆనవాయితీ. ఒడియా సంప్రదాయంలో మహిళాలు భర్త దీర్ఘాయుష్షు కోసం భార్యలు కఠిన ఉపవాసం ఉంటూ పూజల్లో పాల్గొంటారు. కన్నవారి ఇంటి నుంచి గాజులు, చీర, సిందూరం, పారాణి, పండ్లు పంపిస్తారు. ఈ పూజను కొందరు ఇళ్లలో, మరికొందరు మర్రిచెట్టు నీడలో చేశారు.

క్లుప్తంగా

ఐఐటీలో సదస్సు రేపు

భువనేశ్వర్: స్థానిక ఐఐటీలో ఆరోగ్యం, పరిశు భ్రతపై మార్గదర్శక సదస్సును బుధవారం నిర్వహించనున్నారు. క్యాంపస్ ఆడిటోరియంలో సదస్సు జరుగుతుందని అధికారులు సోమవారం ప్రకటించారు. యూనిసెఫ్, ఆయురారోగ్య సౌఖ్యం ఫౌండేషన్, యాక్షన్ ల్యాబ్ 2050 ఫౌండేషన్, ఒడిశా రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రత అలయన్స్ సహకారంతో ఐఐటీ భువనేశ్వర్ రీసెర్చ్- ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పార్క్ 'ప్రాజెక్ట్ పీరియడ్, శానిటేషన్, హెల్త్ - హైజీన్, అండ్ ఎన్విరాన్‌మెంట్ (ఫీ)' చొరవ కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

వలస కార్మికుని మృతి


బులు బెద్రక (ఫైల్)

రాయగడ: ఉపాధిని వెతుక్కుంటూ వలస వెళ్లిన కార్మికుడు మృతి చెందాడు. జిల్లాలోని చంద్రపూర్ సమితి డంగసారొడ పంచాయతీలోని జుడింగి గ్రామానికి చెందిన బులు బెద్రక (19) గత ఏడాది డిసెంబర్ నెలలో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో ఓ నర్సరీలో పనికి కుదిరాడు. కొద్ది నెలల తరువాత శ్రీకాకుళం నుంచి బెంగళూరులోని మరో నర్సరీకి వెళ్లాడు. ఈ క్రమంలో కొద్ది రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురైన బెద్రక శనివారం మృతి చెందినట్లు కుటుంబీకులకు సమాచారం అందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి ఆదివారం నాడు తీసుకువచ్చి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

యువకుని ఆత్మహత్య


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్‌లోని కొచొరా వీధిలో అక్షయనాగ్ (18) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. ఆదివారం సాయంత్రం తన గది తలుపులు వేసుకుని ఉన్న అక్షయ్‌ను తండ్రి రామనాగ్ పిలిచినా ఎంతకీ బయటకు రాలేదు. దీంతో అనుమానించి తలుపులు విరగ్గొట్టి గది లోపలకు వెళ్లి చూడగా ప్లాస్టిక్ తాడు సహాయంతో ఉరి వేసుకుని ఉన్న అక్షయ్ మృతదేహాన్ని చూశాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మించి.. నట్టేట ముంచి..!

- పెళ్లి చేసుకొని దళిత యువతికి మోసం
- ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు



జిల్లా పోలీసు కార్యాలయంలో చంటి బిడ్డతో వివాహిత మంగమ్మ

శ్రీకాకుళం క్రైమ్: ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తున్నానని నమ్మించి పెళ్లి చేసుకున్నాడని.. తనతో ఒక బిడ్డను కన్నాక దళిత మహిళ అని ఒకే ఒక్క కారణంతో తనను వదిలించుకోవాలని చూసి, అంతకుముందే నిశ్చితార్థం చేసుకున్న మరో అమ్మాయితో పరారయ్యాడని ఒక బాధితురాలు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు యర్ర మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదులో మేరకు.. ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన తనని 2019లో లావేరు మండలం శిగిరి కొత్తపల్లి గ్రామానికి చెందిన యర్ర శంకరరావు ప్రేమిస్తునానని చెప్పి హైదరాబాద్ తీసుకువెళ్లి పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో మగబిడ్డను కన్నాక తనది దళిత కులమనే ఒక్క కారణంతో అయిష్టత పెంచుకుని హింసించడం ప్రారంభించాడు. దానికి శంకరరావు కుటుంబ సభ్యులు అతనికి మద్దతు పలికేవారు. కొన్నిరోజులు మళ్లీ ప్రేమను చూపించి హైదరాబాద్ నుంచి శిగిరి కొత్తపల్లి గ్రామంలో ఉన్న తన ఇంటికి తీసుకెళ్తానని నమ్మించాడు. పైడి భీమవరం ఫార్మా కంపెనీలో డ్యూటీ చేసేందుకు అక్కడే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని విధులకు వెళ్లేవాడు.

మరో అమ్మాయితో పరారీ


తన భర్త శంకరరావును పైడి భీమవరం నుంచి తమ ఇంటికి తీసుకెళ్లమని ఎన్నిసార్లు చెప్పినా తీసుకెళ్లేవాడు కాదని మహిళ పేర్కొంది. కారణం అడిగితే తన తల్లిదండ్రులు, అన్నదమ్ములు దళిత మహిళను తీసుకురావడానికి వీల్లేదని కుల పెద్దల సమక్షంలో తేల్చి చెప్పారని సమాధానమిచ్చాడని తెలిపింది. అంతేకాక అంతకు ముందు తన భర్తతో నిశ్చితార్థం జరిగిన దుర్గలక్ష్మి అనే అమ్మాయితో ఎటైనా వెళ్లిపోమని కుటుంబసభ్యులు సలహా ఇవ్వడంతో ఆమెతో కలిసి పరారయ్యాడని పేర్కొంది. ఇదే విషయమై లావేరు పోలీసులకు నెల రోజుల క్రితం ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదని, న్యాయం చేయమని ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డిని ప్రాధేయపడింది.


రాయగడ: పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


జయపూర్: నబరంగ్‌పూర్‌లో సావిత్రి అమావాస్య పూజల్లో కిన్నెరలు


పర్లాకిమిడి: జాజిపురంలో సావిత్రి అమావాస్య పూజల్లో ముత్తైదువులు

భక్తిశ్రద్ధలతో సావిత్రి అమావాస్య


పర్లాకిమిడి: సావిత్రి దేవికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాయగడ: సావిత్రి అమావాస్య పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక జగన్నాథ మందిరం, రాధాకాంత మందిరాల్లో మహిళలు పూజలు చేశారు. అమ్మవారికి పండ్లు, గాజులు, చీర సమర్పించారు.

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో సావిత్రి అమావస్య పూజలు చేపట్టారు. సోమవారం ఉదయం నుంచే మహిళలు సావిత్రి దేవిని కొలిచారు. పుట్టింటి వారి శాంతి, మెట్టింటి వారి ఉన్నతి కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో కిన్నెరలు సావిత్రి అమావస్య పూజల్లో పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: సావిత్రి అమావాస్య సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. పసుపు, కుంకుమలు చల్లగా ఉండాలని పూజించారు. సావిత్రి దేవికి గాజులు, పసుపు కుంకుమలు కానుకగా అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించింది. గుసాని సమితి జాజిపురం గ్రామంలో కిన్నెరలు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ముత్తయిదవులకు కిన్నెరలు ఆశీర్వాదం తెలిపారు.


రాయగడ: రాధాకాంత మందిరం వద్ద అమ్మవారికి సమర్పించిన ఫలాలు


రాయగడ: పసుపుతో రూపొందించిన అమ్మవారి ప్రతిమ


జయపూర్: సావిత్రి అమావాస్య పూజలు చేస్తున్న మహిళలు


జయపూర్: నబరంగ్‌పూర్‌లో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


జయపూర్: సిమిలిగుడలో సావిత్రి అమావాస్య పూజలు


రాయగడ: జగన్నాథ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కుప్పకూలిన ఖుర్దా-బొలంగీరు సొరంగం

భువనేశ్వర్: బౌద్ జిల్లా ఒడెఙిగొడా టీ-4 సొరంగం కుప్పకూలింది. నిర్మాణ దశలో ఇది కుప్పకూలిపోవడం చర్చనీయాంశమైంది. దీనిలో చిక్కుకున్న కార్మికులు, మృతులు తదితర సమాచారం అందుబాటులో లేదు. బౌద్ జిల్లాలో ఖుర్దా రోడ్ - బొలంగీర్ రైల్వే ప్రాజెక్టులోని టీ-4 మలుపు అతి పొడవైన సొరంగం. ఇది ప్రాజెక్ట్‌లోని అతి పొడవైన సొరంగం మాత్రమే కాకుండా ఒడిశాలోని అతి పొడవైన రైల్వే సొరంగం కూడా. ఒడెఙిగొడా-చారిఛొకొ సొరంగంగా సుపరిచితం. ఇది 4,185 మీటర్లు విస్తరించి ఉంది. దీనిలో 30 మీటర్ల పొడవునా సొరంగం కుప్పకూలినట్లు సమాచారం.

పనులకు అంతరాయం

కొంతమంది మాజీ సీనియర్ రైల్వే అధికారుల అభిప్రాయం ప్రకారం, టీ-4 సొరంగం కూలిపోవడం వల్ల 75 కిలోమీటర్ల పొడవైన దసపల్లా - పురుణకటక్ మార్గం నిర్మాణ పనులు పూర్తి కావడం ప్రభావితం అవుతాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రారంభించిన 226 కిలో మీటర్ల అనుసంధానం ప్రశ్నార్థకం అవుతుంది. అంచనా ప్రకారం ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. ఇంతలో కీలక అనుసంధాన సొరంగం కుప్పకూలిపోవడం సమస్యాత్మకం అయ్యే పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఈ సంఘటన సొరంగం నిర్మాణంలో అనుబంధ వర్గాల నైపుణ్య దక్షత పెను సవాళ్లను ఎదుర్కొంటోంది.


కుప్ప కూలిన టీ - 4 టన్నెల్


టీ - 4 టన్నెల్ (ఫైల్)

నిద్రమత్తులో లారీ బోల్తా

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 10వ వార్డు పారసాంబ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై లారీ బోల్తాపడింది. ఇచ్ఛాపురం నుంచి టెక్కలి వైపు వెళ్తుండగా పలాస దాటిన అనంతరం డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతో రోడ్డుపక్కకు వెళ్లిపోయింది. అప్రమత్తమైన లారీ డ్రైవర్ ఒక్కసారిగా అదుపుచేసినప్పటికీ తవుడు లోడుతో ఉన్నటువంటి లారీ పల్టీలుకొట్టింది. లారీ డ్రైవర్, క్లీనర్ గాయాలతో బయటపడ్డారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తాపడిన తవుడు లారీ

బైపాస్ నిర్మాణానికి మంజూరు కాని నిధులు

- పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య

పర్లాకిమిడి: జిల్లా కేంద్రం పర్లాకిమిడికి బైపాస్ రోడ్డు లేక పోవడంతో ప్రజలు అనేక ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణి గ్రాహి రోడ్లు-భవనాల శాఖ ముఖ్యకార్యదర్శిని కలిసి బైపాస్ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అప్పటి కలెక్టర్ లింగరాజ్ పండా సమయంలో బైపాస్ రోడ్డుకు సర్వే జరిపి రోడ్లు-భవనాలశాఖ అంచనాలు రూపొందించారు. సుమారు నాలుగు కిలో మీటర్ల దూరం ఉన్న బైపాస్ రోడ్డు జాజిపురం నుంచి బెత్తగుడ మీదుగా గుమ్మరోడ్డుకు కలపడానికి ఇంజినీర్లు ప్లాన్లు రూపొందించారు. 40 కోట్ల రూపాయలతో అప్పట్లో డీపీఆర్ అంచానాలు రూపొందించారు. కానీ ఇంతవరకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు కాకపోవడం వల్ల టెండర్లు పిలువలేదని రోడ్లు-భవనాల శాఖ, సూపరింటెండింగ్ ఇంజినీరు అభిషేక్ శెఠి తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో మారిన తరువాత జిల్లాకు కొత్త రోడ్లు మంజూరు కాలేదు. అర్ధశతాబ్దకాలం అంచానాలు రూపొందించిన తుంబ- కోయిపూర్- మహేంద్రగిరి- బరంపురం (గంజాం)రోడ్డు పూర్తి కాగలిగింది కానీ, బైపాస్ రోడ్డు ఇంతవరకూ ప్రభుత్వం ఆమోదించలేకపోవడం పట్ల ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచారం వ్యక్తం చేస్తున్నట్టు తెలియజేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

బ్యాంకు మాజీ ఉద్యోగి ఇంటిలో దొంగతనం


దొంగలు ఇంటి లోనికి ప్రవేశిస్తున్న దృశ్యం


ఇంట్లో సామాన్లు చిందర వందర చేసిన దృశ్యం

కొరాపుట్: జయపూర్ పట్టణంలోని ఎక్కాగుడ ప్రాంతంలో షిర్డీ సాయినగర్ 2వ లైన్‌లో కేసీసీ బ్యాంక్ మాజీ ఉద్యోగి అతుల్య మాలిక్ నివాసంలో సోమవారం దొంగలు పడ్డారు. అర్ధరాత్రి తమ సమీప బంధువు మృతి చెందాడని తెలిసి 12 గంటల సమయంలో కుటుంబ సభ్యులంతా పేపర్ మిల్ ప్రాంతానికి వెళ్లారు. తిరిగి ఉదయం 6 గంటలకు ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం సావిత్రి అమావాస్య నేపథ్యంలో బ్యాంకు లాకర్‌లో ఉన్న బంగారం ఇంటికి తెచ్చారు. దొంగలు ఆ బంగారంతో పాటు ఇంటిలో ఉన్న నగదు పట్టుకుని వెళ్లిపోయారు. ఈ ఇంటిలో సీసీ కెమెరాలు ఉండడంతో దొంగలు ముఖాలపై తువ్వాళ్లు కట్టుకుని వచ్చినట్లు గుర్తించారు. సుమారు 30 తులాల బంగారం, 80 వేల నగదు దొంగలు తీసుకెళ్లారని బాధితులు తెలిపారు. తెలిసిన వెంటనే కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ బాధిత కుటుంబం ఇంటికి వచ్చి పరామర్శించారు.

కల్చర్ మారింది!


వరుడి ఊరేగింపులో డొంగిరియాలు

- అడుగు ముందుకేస్తున్న డొంగిరియాలు
- వివాహాల్లో కొత్త పోకడలు

రాయగడ:

కొండ కొనల్లో నివసించి..అడవి తల్లిని నమ్ముకుని తమ జీవనాన్ని కొనసాగించే డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీలు వారి సంప్రదాయాలను గౌరవిస్తు ఆధునిక పద్ధతిలో వివాహాలు చేసుకుని తమదంటూ నాగరికతను చాటుకుంటున్నారు. ఒకప్పుడు వివాహాలు వారి సంప్రదాయాల ప్రకారం గుట్టు చప్పుడు లేకుండా జరిగేవి. నచ్చిన యువతిని తీసుకువచ్చిన వరుడు తమ పెద్దల సమక్షంలో వివాహం చేసుకునే వారు. ఆచార వ్యవహారాల ప్రకారం వారి ఇద్దరిని వివాహం చేసేవారు పెద్దలు. కాని అందుకు భిన్నంగా నేటి యువత వివాహాలను ఆర్భాటంగా కొనసాగిస్తున్నాయి. వివాహాల్లో ఆధునికత ఊరేగింపులు విందు, వినోదాలతో పాటు సంప్రదాయ నృత్యాలతో వివాహాలు కొనసాగుతున్నాయి. వధువు, వరుని తరపున పెండ్లి కి ఆహ్వానించే కార్డులను ముద్రించి వారి బంధువులకు ఆత్మీయులకు ఆహ్వానించడం కనిపిస్తుంది. జిల్లాలోని బిసంకటక్ సమితి కుర్లి గ్రామంలో డ్రేకు జకసిక కొడకు సేతు జకసిక అదే గ్రామానికి చెందిన బండీ వడక కూతురు వనిత వడకతో వివాహం నిశ్చయమయ్యింది . ఈ క్రమంలో వివాహం సోమవారం నాడు జరిగింది. వరుడుకి ముకుటం ధరించి డిజే సౌండ్ ల మధ్య వరుడి ఊరేగింపు కార్యక్రమం అందరిని ఆకర్షించింది. యువత నృత్యాలతో కొనసాగిన ఊరేగింపులో భాగంగా సాంప్రదాయమైన ఆదివాసీ నృత్యాలు కూడా చోటు చేసుకున్నాయి. సుమారు 5 వేల మంది బంధువుల మధ్య వివాహం జరిగింది. ఇంతటి ఆర్భాటంగా వివాహం జరగడంతో డొంగిరియా తెగన్లో ఇదే ప్రథమమని చెప్పాలి.


ఆదివాసీ నృత్యాలు చేస్తున్న మహిళలు

పిల్లలను ఆస్పత్రిలో వదిలేసిన తండ్రి!

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

రాయగడ: తన ముగ్గురు పిల్లలను ఆస్పత్రిలో విడిచి పరారైన తండ్రి ఉదంతం వెలుగు చూసింది. జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ముగ్గురు పిల్లలను ఆస్పత్రిలో విడిచి వెళ్లిన తండ్రి ఆచూకీ కోసం పోలీస్ స్టేషన్‌లో ఆస్పత్రి వర్గాలు ఫిర్యాదు చేశారు. పర్శలి పంచాయతీ పరిధిలోని పరమాలి గ్రామానికి చెందిన సీతా కద్రక అనే డొంగిరియా తెగకు చెందిన వ్యక్తి తన దివ్యాంగుడైన ఆరేళ్ల కొడుకు బిజు కద్రక ఆరోగ్యం బాగోలేదని కళ్యాణసింగుపూర్ ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకువచ్చాడు. బిజుతో పాటు తన మరో 4, 5 ఏళ్ల ఇద్దరు కొడుకులను కూడా తనతో తీసుకువెళ్లిన సీత చికిత్స అనంతరం తన పెద్ద కొడుకు బిజును ఆస్పత్రిలో చేర్పించాడు. కొద్ది సేపటి తరువాత తన ముగ్గురు పిల్లలను అక్కడే విడిచి ఎక్కడకు వెళ్లిపాయాతో తెలియక ఆస్పత్రి వర్గాలు వేతికారు. కాని ఎంతకీ ఆచూకీ తెలియకపావడంతో కళ్యాణ సింగుపూర్ పోలీస్ స్టేషన్‌లో డాక్టర్ ప్రమోద్ కుమార్ మిశ్రొ, సిబ్బంది ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న పర్శలి సమితి సభ్యులు బికాష్ బాగ్ సహకారంతో కల్యాణసింగుపూర్ పోలీస్ స్టేషన్ ఐఐసీ నీలకంఠ బెహర తన వాహనంలో ముగ్గురు పిల్లలను పరమాలి గ్రామానికి తీసుకువెళ్లి కుటుంబీకులకు అప్పగించారు.


తండ్రి విడిచిపెట్టిన పిల్లలు


చికిత్స కోసం ఆస్పత్రిలో ఉన్న దివ్యాంగుడు బిజు

ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రదాన్, తదితరులు

మల్కన్‌గిరి: ఈ నెల 28 నుంచి జూన్ 3వ తేదీ వరకు బరంపురంలో జరగనున్న జోనల్ స్థాయి అండర్ 15 ముఖ్యమంత్రి ఫుట్‌బాల్ పోటీలకు మల్కన్‌గిరి క్రీడాకారులు ఎంపికయ్యారు. మల్కన్‌గిరి జిల్లాలో ఏప్రిల్ 7వ తేదీ నుంచి నిర్వహించిన అండర్ 15 ముఖ్యమంత్రి ఫుట్‌బాల్ ట్రోఫీలో విజేతలను ఎంపిక చేశారు. 24 మంది క్రీడాకారులను సోమవారం జిల్లా అథ్లెటిక్స్ సభ్యులు బరంపురం తీసుకెళ్లారు. జిల్లాకు కీర్తిప్రతిష్టలు తేవాలని అథ్లెటిక్ సంఘం కార్యదర్శి రామహరి పండా, జిల్లా క్రీడా కాంప్లెక్స్ వద్ద జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రదాన్ క్రీడాకారులను ప్రోత్సహించారు. ప్రసాద రావు, సహాయ కర్యదర్శి గోపీకృష్ణ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కారుని ఢీకొన్న ద్విచక్ర వాహనం

రణస్థలం: మండలంలోని దన్నానపేట కొత్త పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై మలుపు తిరుగుతున్న కారును అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. జేఆర్‌పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఒక ఫంక్షన్ కోసం శ్రీకాకుళం వెళ్లి అటునుంచి ద్విచక్ర వాహనంపై అన్నదమ్ములు సున్నపల్లి బోయోడు, బుల్లోడు వస్తున్నారు. దన్నానపేట పెట్రోల్ బంకు సమీపంలో కొత్తగా జంక్షన్ ఏర్పాటు చేయడంతో సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో మలుపు తిరుగుతున్న కారును వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొన్నారు. దీంతో ఇద్దరూ ఎగిరిపడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇరువురినీ 108 వాహనంపై శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి అన్నదమ్ములు పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందినవారు. సరికొత్త స్పోర్ట్స్ బైక్ కావడం అతివేగంగా వచ్చారని స్థానికులు చెబుతున్నారు. ఇంకా బైకు నంబర్ కూడా రాలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

తల్లీకొడుకుల అదృశ్యం

సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామానికి చెందిన తల్లీకొడుకులు ఈ నెల 23 నుంచి కనిపించడంలేదు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 23న రాత్రి కుటుంబసభ్యులు ఇంట్లో గొడవ పడ్డారు. ఇంట్లో గొడవ అనంతరం అందరూ గాఢనిద్రలో ఉన్నసమయంలో కొడుకును తీసుకుని తల్లి ఇంటినుంచి వెళ్లిపోయినట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. 24న ఉదయం నుంచి తల్లీకొడుకుల ఆచూకీ కోసం గ్రామంలోనే కాకుండా చుట్టాలు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. అయినా ఆచూకీ కనిపించకపోవడంతో అదృశ్యమైన మహిళ తల్లి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

లారీని ఢీకొని యువకుడి మృతి



జగన్ మృతదేహం

గంట్యాడ: బొండపల్లి మండలం రాళ్లవాక గ్రామానికి చెందిన యువకుడు బొండపల్లి జగన్ (19) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హీరోహోండా గ్లామర్ బైక్‌పై కింతాడ మధు అనే వ్యక్తితో కలిసి బొండపల్లి జగన్ ఆదివారం రాత్రి విజయనగరం మండలం సారిక గ్రామానికి వెళ్తుండగా రామవరం ఫైఓవర్‌పై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో జగన్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మధుకు తల, ఎడమ కాలికి తీవ్ర గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

మామిడి తోట ధ్వంసం



ఏనుగులు పెకిలించిన చెట్లను పరిశీలిస్తున్న స్థానికులు

గరుగుబిల్లి: ఏనుగుల గుంపు ఆదివారం రాత్రి గరుగుబిల్లి మండలంలోని తోటపల్లిలో ప్రవేశించి గ్రామానికి చెందిన లోపింటి వెంకయ్య మామిడి తోటను ధ్వంసం చేశాయి. మరో రెండు మూడు రోజుల్లో చేతికి రావాల్సిన పంటను నష్టపరిచాయి. 15ఏళ్ల క్రితం ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఎకరా డీ పట్టా భూమిలో మామిడి తోటను వేసుకుని జీవనోపాధి పొందుతున్న వెంకయ్యకు చేతికి అందిన పంట ఏనుగుల రూపంలో నష్టపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంటను నష్టపరచడమే కాకుండా కొన్ని చెట్లను కూడా భూమి నుంచి పెకిలించి వేశాయని బాధితుడు వాపోయాడు. ఏనుగుల కారణంగా మామిడి తోటలో సుమారు రూ.50వేల వరకు నష్టం జరిగిందని, అధికారులు స్పందించి జరిగిన పంటనష్టాన్ని అంచనావేసి పరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

రెగ్యులర్ డీఈఓను నియమించాలి

పార్వతీపురం: జిల్లా విద్యాశాఖకు రెగ్యులర్ డీఈఓను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఏర్పడిన తరువాత వరుసగా మూడు సార్లు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిన పార్వతీపురం మన్యం జిల్లాకు పూర్తి స్థాయి హోదా కలిగిన డీఈఓ లేకపోవడం బాధకరమన్నారు. తక్షణం రెగ్యులర్ డీఈఓ నియమాకం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. అంతవరకు అడిషనల్ డైరెక్టర్‌గా ఉన్న గిరిజన మహిళాఅధికారి రమాజ్యోతిని ఇన్‌చార్జ్ డీఈఓగా నియమించాలన్నారు. విద్యావ్యవస్థ కుంటుబడకుండా నిరాటంకంగా కొనసాగేందుకు అధికారులు దృష్టిసారించాలని కోరారు.

కాగితపు బొమ్మల తయారీపై శిక్షణ



కాగితపు బొమ్మలు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి తదితరులు

విజయనగరం టౌన్: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కాగితపు బొమ్మల తయారీపై సోమవారం శిక్షణ ఇచ్చారు. అంతకుముందు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించి, అనంతరం కాగితాలతో ఏ విధంగా వివిధ బొమ్మలు తయారు చేయాలో సిబ్బంది నేర్పించారు. పిల్లలు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, తయారు చేసిన బొమ్మలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ

విజయనగరం అర్బన్: స్థానిక ఉడా కాలనీ శ్రీసత్యయోగా కేంద్రంలో యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నారు. యోగా గురువు, రిటైర్డ్ టీచర్ కొరుపోలు సత్యారావు శిక్షణకు హాజరవుతున్న వారికి యోగాసనాలు వేయడం నేర్పిస్తున్నారు. అనంతరం యోగాసనాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.

కౌలు రైతుల కంటకన్నీరు..!



భూమి దున్నుతున్న రైతు

- అన్నదాత సుఖీభవ లేనట్లేనా అని ఆందోళన
- వైఎస్సార్‌సీపీ హయాంలో రైతుభరోసా అందజేత

కౌలు రైతులకు వర్తించదు

అన్నదాత సుఖీభవ పథకం కోసం భూయాజమానులు, అటవీ భూమి సాగు చేస్తున్న రైతుల వివరాలు వెరిఫికేషన్ చేయమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వారికే వెరిఫికేషన్ చేస్తున్నాం. కౌలు రైతులకు ఈ విడతలో అన్నదాత సుఖీభవ వర్తించదు. కౌలు రైతుల గుర్తింపు, రెన్యువల్ జరుగుతుంది.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

విజయనగరం ఫోర్ట్: అధికారంలోకి వస్తే రైతులందరికీ రైతు భరోసా సాయాన్ని పెంచుతాం. అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పింది. తీరా అధికారంలో వచ్చిన మొదటి ఏడాదే రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎగ్గొట్టింది. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ ఇస్తామని కూటమి నేతలు చెబుతున్నారు. ఇందుకోసం రైతుల వివరాలను వెరిఫికేషన్ చేస్తున్నారు. అయితే కౌలు రైతులకు మాత్రం అన్నదాత సుఖీభవ పథకం వర్తించే సూచనలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే కౌలు రైతుల గుర్తింపు పక్రియ పూర్తిస్థాయిలో ఇంతవరకు జరగలేదు. దీని వల్ల వారికి అన్నదాత సుఖీభవ సాయం అందడం అనుమానంగా కనిపిస్తోంది.

ఈ ఏడాది కౌలు రైతుల గుర్తింపు లక్ష్యం 16250

2025–26 ఖరీఫ్ సీజన్‌లో వేలాది మంది కౌలు రైతులను గుర్తించాల్సి ఉంది. కానీ వ్యవసాయ అధికారులు చాలా తక్కువ మందిని గుర్తించారు. ఈ ఏడాది 16,250 మంది కౌలు రైతులను గుర్తించాల్సి ఉండగా ఇంతవరకు గుర్తించింది కేవలం 200 మందిని మాత్రమే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏప్రిల్, మే నెలలోనే కౌలు రైతుల గుర్తింపుపై అవగాహన సదస్సులు నిర్వహించి కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు ఇచ్చేవారు. కానీ ఈఏడాది మే నెల రెండో వారం వరకు ఆ ప్రక్రియ ప్రారంభం కానట్లు తెలుస్తోంది.

భూయాజమానులు, అటవీభూములు సాగు చేసే వారికే..

అన్నదాత సుఖీభవ పథకం కింద అందించే ఆర్థిక సాయానికి భూయాజమానులు, అటవీ భూములు సాగు చేసే వారే అర్హులని ప్రభుత్వం పేర్కొంది. దీన్ని బట్టి కౌలు రైతులకు ఆర్థిక సాయం ఇచ్చే పరిస్థితి లేనట్లు తెలుస్తోంది. జిల్లాలో భూయాజమానులకు, అటవీభూమి సాగు చేసే రైతులకు వ్యవసాయ అధికారులు అన్నదాత సుఖీభవ పథకం కోసం వెరిఫికేషన్ చేస్తున్నారు. జిల్లాలో 4,89,252 మంది రైతులు ఉన్నారు. వారిలో 2,159 మంది అటవీ భూమి సాగుచేసే వారు ఉన్నారు. మొత్తం రైతుల్లో 4,36,744 మంది రైతులకు వెరిఫికేషన్ చేశారు. ఇంకా 50 వేల మందికి పైగా వెరిఫికేషన్ పూర్తి కావాల్సి ఉంది. ఈనెల 25వతేదీతో వెరిఫికేషన్‌కు గడువు పూర్తవుతుంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా సాయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భూయాజమానులు, అటవీభూమి సాగు చేసే రైతులతో పాటు కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం కింద సాయం అందజేశారు. దీంతో వారు మిగతా రైతుల మాదిరి వారు సాగు చేసిన పంటలకు పెట్టుబడి పెట్టుకునే వారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునే వారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

శృంగవరపుకోట: మండలంలో సంచలనం రేకెత్తించిన తల్లి హత్యకేసును ఎస్.కోట పోలీసులు ఛేదించారు. ఈ మేరకు కేసు వివరాలను సోమవారం ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ రాత్రి తన తల్లి, చెల్లి బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి తన తల్లి ఎర్రాప్రగడ వెంకటలక్ష్మి(35)ని తీసుకుపోయారని చెల్లెలు రుచిత చెప్పిందని వెంకటరమణపేట గ్రామానికి చెందిన ఎర్రాప్రగడ హరీష్ 18వ తేదీ ఉదయం 5గంటలకు ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అనుమానాలే ఆధారంగా..

హరీష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేయగా ఘటనాస్థలిలో రక్తపుమరకలు ఉండడంతో క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టామన్నారు. రుచిత వాదనల్లో సరైన పొంతన లేకపోవడంతో అనుమానంతో గట్టిగా విచారణ చేయడంతో వాస్తవాలు చెప్పింది. తన తల్లిని ఎవరూ కిడ్నాప్ చేయలేదని, తన స్నేహితులతో కలిసి పథకం ప్రకారం హత్య చేశామని చెప్పింది. శవాన్ని దగ్గరలోని నేలబావిలో రాళ్లు కట్టి పడేసి, కొబ్బరి మట్టలు వేసి కప్పారన్నారు. దీంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించినట్లు డీఎస్పీ చెప్పారు.

ప్రేమ వికటించింది

గ్రామానికి చెందిన సలాది హరికృష్ణ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆ డ్రైవర్ రుచితతో కొన్నాళ్లుగా ప్రేమాయణం సాగించాడు. ఇది నచ్చని రుచిత తల్లి వెంకటలక్ష్మి తన కుమార్తెను ఇచ్చి పెళ్లి చేయనని చెప్పింది. అప్పటికీ హరికృష్ణ తన తీరు మార్చుకోక పోవడంతో వెంకటలక్ష్మి ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. దీంతో హరికృష్ణపై పోక్సో కేసు నమోదైంది. ప్రస్తుతం కేసు ట్రయల్స్‌కు రావడంతో తనపై కేసు తీసేయాలని, రుచితను తనకిచ్చి పెళ్లి చేయాలని, వెంకటలక్ష్మిని హరికృష్ణ ఒత్తిడి చేశాడు. ఆమె అంగీకరించక పోవడంతో రుచితతో కలిసి హత్యకు పథకం పన్నాడు. బహిర్భూమికి అంటూ రుచితతో చెప్పించి వెంకటలక్ష్మిని బయటకు రప్పించి హరికృష్ణ, రుచితలు మరో బాలుడితో కలిసి, గొంతు కోసి హత్య చేశారు. రుచితను జువైనల్ హోమ్‌కు తరలించి హత్య చేసి పరారైన హరికృష్ణ కోసం మూడు బృందాలను రంగంలోకి దించారు. సోమవారం అందిన సమాచారంతో ఒడిశా వైపు బైక్‌పై వెళ్తున్న హరికృష్ణను, హత్యానేరంలో ఉన్న మరో బాలుడిని అరెస్టు చేసి, వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని, వాంగ్మూలం రికార్డు చేసి, కోర్టులో హాజరు పరిచామని డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ వి.నారాయణమూర్తి, ఎస్సైలు చంద్రశేఖర్, గంగరాజు పాల్గొన్నారు.

కదులుతున్న చోరీ కేసులో డొంక

- సమాచార సహకారంలో చీపురుపల్లికి చెందిన ఓ వ్యక్తి
- ఇంతవరకు ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మిగిలిన వారి కోసం గాలింపు

చీపురుపల్లి: తీగలాగితే డొంక కదిలిందన్న చందంగా ఉంది చీపురుపల్లిలో ఈ నెల 23న జరగిన చోరీ ఘటన. ఈ చోరీ కేసులో దొంగలను పట్టుకుంటున్న పోలీసులకు విచారణలో మరిన్ని విషయాలు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. చోరీకి పాల్పడిన వారిలో అధిక సంఖ్యలో వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో ఇంతవరకు ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ ఇంకా చాలా మంది ఉన్నారని గుర్తించి మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. చోరీ జరిగిన 24 గంటల్లోనే డిజిటల్ సహకారంతో తెనాలిలో ఇద్దరు దుండగులను గుర్తించిన పోలీసులకు వారిని పట్టుకుని విచారణ చేస్తున్న సమయంలో మరిన్ని వాస్తవాలు తెలిసినట్లు సమాచారం. ఆ ఇద్దరు మాత్రమే కాకుండా చాలా మంది పాత్ర ఇందులో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకనే చోరీ జరిగి నాలుగు రోజులు కావస్తున్నప్పటికీ 24 గంటల్లోనే ఇద్దరు, మరో 24 గంటల్లో ముగ్గురు దుండగులు దొరికినప్పటికీ పోలీసులు ఇంకా ఒక కొలిక్కి రాలేకపోతున్నట్లు చర్చ జరుగుతోంది.

సమాచార సహకారంలో చీపురుపల్లి వ్యక్తి..

ఈ నెల 23న పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో జరిగిన చోరీ ఘటనలో రోజుకో కొత్త కోణం బయటకు వస్తోంది. చోరీ జరిగిన ఇంటికి సంబంధించి ఓ మహిళ రెక్కీ నిర్వహించి ఫొటోలను దుండగులకు అందజేసినట్లు ఇప్పటికే చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా చోరీ జరిగిన ఇంటి యజమాని, ఆయన స్థితిగతులు, ఆర్థిక వివరాలు వంటి సమాచారాన్ని మండలంలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి దుండగులకు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. దీంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకోనున్నట్లు తెలిసింది.

ఉత్సవ కమిటీ వసూలు చేసిన చందాలపై విచారణ చేపట్టండి

సాలూరు: ఎండోమెంట్ పరిధిలో గల సాలూరు శ్యామలాంబ అమ్మవారి పండగకు అనధికారికంగా మంత్రి సంధ్యారాణి ఏర్పాటుచేసిన ఉత్సవ కమిటీ లక్షల రుపాయలు చందాలు వసూలు చేసిందని ఆరోపిస్తూ, వాటిపై విచారణ జరపాలని జనసేన నాయకుడు రేగు మహేశ్వరరావు, రిపబ్లికన్ పార్టీ నాయకుడు గొంప ప్రకాశరావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, దేవాదాయశాఖ పరిధిలో శ్యామలాంబ ఆలయం ఉందని, కావున అమ్మవారి పండగను ఎండోమెంట్ అధికారులు నిర్వహించాల్సి ఉందన్నారు. కానీ అనధికారికంగా ఓ కమిటీని వేసి ప్రజల నుంచి చందాల రూపంలో కొన్ని రూ.కోట్లు వసూలు చేశారని ఆరోపించారు.ఈ అనధికార కమిటీ ఎంత చందాలు వసూలు చేసింది? ఎంత ఖర్చు చేసిందో? ప్రజలకు తెలియజేయాల్సి ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో జాయింట్ కలెక్టర్‌కు ఈ మేరకు ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు.

24 గంటల్లో అర్జీలు పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- పీజీఆర్ఎస్‌కు 160 వినతులు

విజయనగరం అర్బన్:

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చిన వినతులను 24 గంటల్లో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరించే ముందు అధికా రులతో సమీక్షించారు. ఆన్‌లైన్‌లో ఇంకా చూడవలసిన వినతులు 8 ఉన్నాయని గడువు దాటిన వినతులు 2 ఉన్నాయని వినతుల పరిషాకరంలో గడువు దాటినందుకు సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం లోగా వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. రీ ఓపెన్ కేసులు లేకుండా చూడాలని జిల్లా ఆడిట్ టీమ్ కూ డా పెండింగ్ లేకుండా ఎప్పటి వినతులు అప్పుడే ఆడిట్ చేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 160 వినతులు అందాయి. కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మురళి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీలలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించిన భూసమస్యలు 82 నమోదయ్యాయి. పంచాయతీ రాజ్ శాఖ 10, పింఛన్ల మంజూరు చేయాలని తదితర అంశాలపై డీఆర్‌డీఏకు 21, మున్సిపాలిటీకి 10, జీఎస్‌డబ్ల్యూకు 1, విద్యాశాఖకు 7, హౌసింగ్‌కు 1 అందగా వైద్యశాఖకు 2, విద్యుత్ శాఖకు 5 వినతులు అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కలెక్టరేట్ వద్ద సహాయ కేంద్రం

ప్రజావినతుల పరిష్కార వేదికకు వచ్చే నిరక్షరాస్యులకు అర్జీలను రాయడానికి కలెక్టరేట్ వద్ద సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అర్జీదారుల కోసం షామియానా ఏర్పాటు చేసి కలెక్టరేట్ నుంచి ఆరుగురు సిబ్బందిని నియమించడంతో అర్జీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డీఆర్‌ఓ కార్యాయలం వద్ద మరో ఇద్దరు అర్జీలు రాసే సహకారం అందజేయడంతో మధ్యవర్తుల జాడ కనబడలేదు. నిరక్షరాస్యులైన వారు తమ అర్జీలను రాయడానికి దళారులను ఆశ్రయిస్తున్నారని వారు అర్జీదారులను మభ్య పెట్టి వారి నుంచి డబ్బును తీసుకుని ప్రతివారం కలెక్టరేట్ చుట్టూ తిరిగేలా చేస్తున్నారని ఇకపై కూడా అర్జీదారులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని జిరాక్స్ కేంద్రాల్లో రాయించవద్దని కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన హాయకేంద్రంలో సంప్రదించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ సౌమ్యలత

బదిలీల ఫైళ్లు ముందుగానే పెట్టండి

బదిలీల ఫైళ్లను ఆఖరి తేదీన కాకుండా ముందుగానే పెట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బదిలీలలో ఎటువంటి సిఫార్సులను ఆమోదించబోనని, నిబంధనల మేరకే చేపడతానని స్పష్టం చేశారు.

అడిషనల్ ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 32 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల వేదిక కార్యక్రమాన్ని ఏఎస్పీ సౌమ్యలత నిర్వహించి 32 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె ఫిర్యాదుదారుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మా ట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని సిబ్బందిని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, ఏడు రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ సీబీలు ఆర్వీఆర్కే చౌదరి,లీలారావు డీసీ ఆర్టీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కరించాలి

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

విజయనగరం గంటస్తంభం: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం తక్షణమే విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ విజయనగరం జిల్లా నాయకులు టీవీ రమణ, కె.అప్పలసూరి, బి.రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద విశాఖ ఉక్కు పరిశ్రమ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..32 మంది బలిదానంతో విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పడిందని, ఆంధ్ర రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం అమ్మేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని, మరింత సమర్థవంతంగా నడపాలని పోరాడుతుంటే, 4000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి, నిర్బంధం ప్రయోగించి, ఉద్యమాన్ని అణిచివేయాలని కేంద్రం భావిస్తోందని ఆరోపించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం ద్వారా విశాఖ ఉక్కు పరిరక్షణ కట్టుబడి ఉంటామన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ స్పందించి స్టీల్‌ప్లాంట్ సమస్యను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రీవెన్స్ సెల్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి శంకర్రావు, ఎం.వాసు, వి.లక్ష్మి, సూర్యనారాయణ, జగన్మోహన్ రావు, ఆనంద్, పెంటరాజు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిలో భాగం యోగా



యోగాలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



యోగా నేర్పిస్తున్న గురువు



యోగాసనం వేస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



యోగా సనం వేస్తున్న మహిళ

- జిల్లాకేంద్రంలో సామూహిక యోగాభ్యాసం

విజయనగరం: భారతీయ సంస్కృతిలో సంప్రదాయంగా వస్తున్న వ్యవస్థల్లో యోగా ఒకటి అని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని పైడితల్లి అమ్మవారి ఆలయం రోడ్డులో సామూహిక యోగాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కోట వరకు ర్యాలీ చేపట్టారు. ప్రజలు, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు అధికంగా పాల్గొని యోగ ఔన్నత్యాన్ని చాటారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని యోగా ఆవశ్యకతపై చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. నెల రోజులపాటు యోగా కార్యక్రమాలను వివిధ రకాలుగా జిల్లా యంత్రాంగం నిర్వహిస్తుందని చెప్పారు. ఒక్కో ప్రధాన ప్రాంతంలో రెండు రోజులపాటు యోగా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేయనున్నామని తెలిపారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సమాజంలో ప్రతి ఒక్కరూ యోగా అభ్యసించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జీవన్ రాణి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరావు, అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఈఈ టి.రాయల్ బాబు, టీపీఆర్‌ఓ సింహాచలం, డీఈలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి..



మాట్లాడుతున్న ఇప్పలవలస విద్యుత్ వినియోగదారులు

మెరకముడిదాం: విద్యుత్ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలేమిటో.. అవాస్తవాలు ఏవో తెలుస్తాయి తప్ప, ఏసీ రూముల్లో కూర్చుని ప్రెస్‌నోట్‌లు విడుదల చేయడం సరికాదని మండలంలోని ఇప్పలవలస గ్రామానికి చెందిన విద్యుత్ వినియోగదారులు అన్నారు. సర్పంచ్ బెహరా రమేష్, బిళ్లలవలస సర్పంచ్ ప్రతినిధి తిరుమలరాజు నరసింహరాజు(వర్మ)లతో కలిసి పలువురు విద్యుత్‌వినియోగదారులు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. మా గ్రామానికి ఆరు నెలల కిందట వరకు విద్యుత్ బిల్లుల వసూళ్లకు ఆర్ఈసీఎస్ నుంచి అధికారులు వచ్చేవారని.. గత ఆరు నెలలుగా మాత్రం బిల్లుల వసూలుకు ఏపీఎస్ఈబీ సిబ్బంది ఎవ్వరూ రావడం లేదన్నారు. ఇదే విషయాన్ని మా సర్పంచ్ రమేష్ ద్వారా విలేకరుల సమావేశంలో తెలియజేయగా.. ఈ విషయమై ఈ నెల 19న 'విద్యుత్ బిల్లులు ఎలా చెల్లించేది..?' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైందని చెప్పారు. ఈ కథనానికి విద్యుత్‌శాఖ ఈఈ జిల్లా కేంద్రంలో స్పందిస్తూ సాక్షి దినపత్రికలో వచ్చిన కథనం అవాస్తవమని ప్రెస్‌నోట్ విడుదల చేయడం సరికాదన్నారు. విద్యుత్ శాఖాధికారులు ఎవ్వరూ గ్రామంలోకి వచ్చి ఎంక్వైరీ చేయకుండా జిల్లా కార్యాలయాల్లో కూర్చోని ప్రెస్‌నోట్‌లు ఎలా విడుదల చేస్తారని ప్రశ్నించారు. వాస్తవ పరిస్థితి తెలుసుకోకుండా మాట్లాడితే కన్జ్యూమర్ కోర్టుకు వెళ్తామని తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు కె.సాంబ, మిరియాల రామప్రసాద్, కె.మురళీధరరావు, మంత్రి పైడినాయుడు, సత్యం, సీహెచ్.సత్యనారాయణ, రేజేటి వెంకటినాయుడు, చింతపల్లి రామారావు, వెంకటరమణ, లోచర్ల ఆది, సీహెచ్ స్వామినాయుడు, రౌతు అప్పలనాయుడు, సిరిపురపు సింహాచలం, బోని సన్యాసిరావు, ఎం.శంకర్, కొండేటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

మీరే బాస్‌లా వ్యవహరిస్తే ఎలా?



సమావేశంలో ధ్వజమెత్తుతున్న నాయకులు

- నెల్లిమర్ల నగరపంచాయతీ కమిషనర్‌పై కౌన్సిలర్ల మండిపాటు

నెల్లిమర్ల: నగరపంచాయతీ కమిషనర్ తారక్‌నాథ్ తీరుపై కౌన్సిలర్లు, టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ఈ నెల 30వ తేదీన జరిగే నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టే అజెండాపై చర్చించేందుకు మండల కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ బంగారు సరోజిని ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలు విషయాల్లో కౌన్సిలర్లు లెంక అప్పలనాయుడు, చిక్కాల రవి, కారుకొండ కృష్ణ, ముడిమంచి లక్ష్మణరావు తదితరులు కమిషనర్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మీరు(కమిషనర్‌ను ఉద్దేశించి) చేసే పనుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది.. కౌన్సిలర్లను సంప్రదించకుండా మీరే సొంతంగా నిర్ణయాలు తీసుకుంటే ఎలా అని ప్రశ్నించారు. చైర్‌పర్సన్‌తో కలిసి మీరే బాస్‌లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులను సైతం ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. కార్యాలయానికి పిలిపించుకుని మరీ డబ్బులు అడుగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని, దాన్ని పరిష్కరించడం లేదని వాపోయారు.

పాలన చేతకాకుంటే చెప్పండి..

వార్డుల్లో పర్యటించడం మంచిదేనని, అయితే గుర్తించిన సమస్యలకు పరిష్కారం ఎక్కడన్నారు. పట్టణానికి చెందిన అన్ని పార్టీల పెద్దలతో చర్చించిన తర్వాతనే ఏదైనా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పాలన చేతకాకపోతే కార్యాలయానికి తాళం వేసి వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకానొక సందర్భంలో కమిషనర్ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించినా నాయకులు, సభ్యులు అడ్డగించారు. వైస్ చైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ నగర పంచాయతీలో సమస్యల పరిష్కారానికి, మెరుగైన పాలనకు కౌన్సిల్ సభ్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. అలాగే నిబంధనలకు అనుగుణంగా నిర్మిస్తున్న ఇళ్ల జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, జానా సంధ్యారాణి, బూర సుజాత, నాయకులు పొంద్రంకి సత్యనారాయణ, పైల మురళి తదితరులు పాల్గొన్నారు.